సంపుటి :03 | సంచిక :58 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 11, ఏప్రిల్ 2026


## పగలు చేపల వేట..
# రాత్రి బ్యాటరీల చోరీ

- హసన్‌పర్తి పోలీసుల వలకి చిక్కిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా
- 13 సెల్ టవర్లలో బ్యాటరీల చోరీ, నిందితుల నుంచి భారీగా సొత్తు స్వాధీనం
- ఐదుగురు నిందితులు కటకటాల్లోకి..

05

# ఐసుక్రీం ఆశచూపి అనంతలోకాలకు

- ఆడపిల్లలు పుడుతున్నారనే అక్కసు..
- వివాహేతర సంబంధానికి అడ్డంకి అని కక్ష
- భార్య, ఇద్దరు కుమార్తెలను స్విమ్మింగ్ పూల్‌లో ముంచి చంపిన కిరాతకుడు
- సంచలనం సృష్టించిన ట్రిపుల్ మర్డర్ కేసు గుట్టురట్టు
- ముగ్గురి హత్య కేసులో డాక్టర్లు, ఆర్‌ఎంపీల నిర్వాకం వెలుగులోకి
- భర్త అజారుద్దీన్ తో



# క్లీన్ స్వీప్

- -తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసినట్లే డీజీపీ శివధర్‌రెడ్డి ప్రకటన

- పీఎల్‌జీఏ పూర్తిస్థాయిలో కనుమరుగైనట్లు వెల్లడి
- ఒకేసారి 42 మంది మావోయిస్టుల లొంగుబాటు

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పోలీస్ చరిత్రలో ఒక మైలురాయి లాంటి ఘట్టం ఆవిష్కృతమైంది. దశాబ్దాల కాలంగా సాగుతున్న సాయుధ పోరాటానికి తెరపడినట్లు రాష్ట్ర పోలీస్ బాస్ ప్రకటించారు. శుక్రవారం రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో ఏకంగా 42 మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. లొంగిపోయిన వారిలో కీలక కేడర్‌కు చెందిన సభ్యులు కూడా ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా డీజీపీ శివధర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సంచలన ప్రకటన చేశారు. "తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు పూర్తిస్థాయిలో మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారింది" అని ఆయన అధికారికంగా ప్రకటించారు. ఒకప్పుడు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన మావోయిస్టు ప్రభావం ఇప్పుడు నామరూపాల్లేకుండా పోయిందని ఆయన స్పష్టం చేశారు.

### ముగిసిన పీఎల్‌జీఏ ప్రస్థానం

మావోయిస్టు పార్టీకి వెన్నెముకగా భావించే పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) ప్రస్థానం రాష్ట్రంలో ముగిసిందని డీజీపీ వివరించారు. రాష్ట్రంలో పీఎల్‌జీఏ పూర్తిగా కనుమరుగైందని వెల్లడించారు. మావోయిస్టులకు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి గానీ, కేడర్ నుంచి గానీ ఎటువంటి ఆదరణ లేదని అన్నారు. ప్రభుత్వ పునరావాస పథకాల పట్ల నమ్మకంతోనే మావోయిస్టులు లొంగిపోతున్నారని పేర్కొన్నారు. లొంగిపోయిన 42 మంది మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని, వారు గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని డీజీపీ శివధర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి.

### పునరావాసం కల్పిస్తాం

లొంగిపోయిన 42 మంది మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని, వారు గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని డీజీపీ శివధర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి.





# ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- నిర్వాహకుడితో సహా 12 మంది అరెస్ట్
- రూ.1,06,000 నగదు, 12 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం
- టాస్క్ ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి




అక్షరదర్బార్, హనుమకొండ: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో అక్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న నమ్మదగిన సమాచారంతో టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి, ఒక నిర్వాహకుడితో పాటు 11 మంది బెట్టింగ్ క్రీడాకారులను అదుపులోకి తీసుకుంది. హన్మకొండ గోపాల్‌పూర్, వెంకటేశ్వర కాలనీకి చెందిన గట్ల రాజేష్ (34) అనే వ్యక్తి 'Cric666.live' అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. ఇతనితో పాటు మరో 11 మంది కలిసి బెట్టింగ్‌కు పాల్పడుతుండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,06,000 నగదు, 12 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చర్యల నిమిత్తం కేయూసీ పోలీసులకు అప్పగించారు.

### అరెస్ట్ అయిన వారి వివరాలు

నిర్వాహకుడు హనుమకొండ గోపాలపూర్ వాసి గట్ల రాజేష్. బెట్టింగ్ క్రీడాకారులు గర్నపల్లి అరవింద్ కుమార్ (చింతగట్టు, హన్మకొండ), చిట్ల రాజేష్ (ఈస్ట్ ఖిల్లా, వరంగల్), దేవర వినయ్ (ఈస్ట్ ఖిల్లా, వరంగల్), జెట్టబోయిన కుమార్ (ఈస్ట్ ఖిల్లా, వరంగల్), ముప్పారపు రాజేంద్ర ప్రసాద్ (చింతగట్టు, హన్మకొండ), వంగా శివ కుమార్ (శ్రీపతిపల్లి, జనగామ), గంగుల అనిల్ (కొత్తపల్లి, జనగామ), బాశబోయిన శ్రీకాంత్ (శ్రీపతిపల్లి, జనగామ), ఏర్ల విగ్నేష్ (శ్రీపతిపల్లి, జనగామ), బూరు మధుకర్ (కొత్తపల్లి, జనగామ), పినిగిల్ల రవీందర్ (కొత్తపల్లి, జనగామ). ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ సర్ల రాజు, ఆర్ఎస్ఐ ఓ భాను ప్రకాష్, వారి బృందం పాల్గొన్నారు. క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

అక్షర దర్బార్
Voice of the People

# కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ముకిరాల మధువంశీకృష్ణ

- నియామకం పట్ల పార్టీ శ్రేణుల హర్షం
- నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: మధువంశీకృష్ణ



అక్షర దర్బార్, చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా చిట్యాల మండలం రామయ్యపల్లి గ్రామానికి చెందిన ముకిరాల మధువంశీకృష్ణ రెండోసారి ఎంపికయ్యారు. ఈ నియామకం పట్ల పార్టీ శ్రేణులు శుక్రవారం హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మధువంశీకృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండోసారి అవకాశం కల్పించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# పనితో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ సూచన



అక్షర దర్బార్, పరకాల: పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సమర్థంగా నిర్వర్తిస్తూనే, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయంలో ఆయన కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎండాకాలం దృష్ట్యా పనులు చేసే సమయంలో తగినంత నీరు, నిమ్మరసం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వార్డు ప్రజలతో, కౌన్సిలర్లతో గౌరవంగా వ్యవహరించాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. అంజయ్య, కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కబడ్డీకి వివేకానంద స్కూల్ విద్యార్థి

- జట్టు కెప్టెన్‌గా సత్తా చాటిన పాలిత సాయిచంద్ర

అక్షర దర్బార్, చిట్యాల: 69వ ఎస్‌జీఎఫ్ స్టేట్ లెవల్ స్కూల్ గేమ్స్‌లో చిట్యాల మండలం విడుదల గ్రామంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్ విద్యార్థి పాలిత సాయిచంద్ర అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఉమ్మడి వరంగల్ జిల్లా తరఫున అండర్-17 కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన సాయిచంద్ర, జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించి మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందుకున్నాడు. సాయిచంద్ర భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని పాఠశాల కరస్పాండెంట్ సతీష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ సంఘ రఘుపతి యాదవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.





# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళిక

- 19వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి పర్యటన
- అంగన్‌వాడీ కేంద్రంలో ఆహార నాణ్యత పరిశీలన

అక్షర దర్బార్, నర్సంపేట: వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్' సిద్ధం చేస్తున్నట్లు నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ తెలిపారు. శుక్రవారం 19వ వార్డులో కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్ తో కలిసి పర్యటించి డ్రైనేజీ, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. వార్డులో నీటి కొరత లేకుండా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో కొత్త బోర్లు వేయించి మోటార్లు అమర్చినట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందించే పౌష్టికాహార నాణ్యతను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రోజా రాణి, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# హిందువుల ఐక్యతే జాతీయ సమైక్యత

- మండల కేంద్రంలో 'హిందూ ధర్మ సమ్మేళనం' కరపత్రాల ఆవిష్కరణ
- 15న జరిగే సమ్మేళనానికి అందరూ తరలిరావాలి: తౌటం నవీన్

అక్షర దర్బార్, చిట్యాల: దేశానికి ఆత్మ వంటి హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి హిందువులందరూ ఐక్యం కావాలని హిందూ ధర్మ సమ్మేళన సమితి మండల అధ్యక్షుడు తౌటం నవీన్ అన్నారు. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలో సమ్మేళన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీన (బుధవారం) సాయంత్రం 4:30 గంటలకు రామాలయ మైదానంలో జరిగే సమ్మేళనానికి ముఖ్య అతిథిగా పూజ్య బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామి వస్తున్నట్లు తెలిపారు. హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ బుర్ర సదయ్య, ఎలేటి రామయ్యపల్లి సర్పంచ్ కోడారి అశోక్, కోటంచ డైరెక్టర్ దొడ్డి కిష్టయ్య, మాజీ సర్పంచ్ పుల్లూరి రమాదేవి, సతీష్, ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, ముదన నాగరాజు, నేపాలి రాకేష్, బండి రాజు, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.




# నిరుపేదకు న్యాయం చేయాలి.. పట్టా ఇప్పించాలి

- తహశీల్దార్‌కు సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మల్లేష్ వినతి

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల గ్రామానికి చెందిన కండె ఓదెలు అనే నిరుపేద ఎరుకల కులస్తుడు గత 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఎకరం భూమికి పట్టా ఇప్పించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ శుక్రవారం తహశీల్దార్ వసంతరావుకు వినతిపత్రం అందజేశారు. కైలాపూర్ శివారులోని సర్వే నెం. 86లో ఓదెలు సాగులో ఉన్నాడని, గతంలో అదే సర్వే నంబర్‌లో 14 మందికి పట్టాలిచ్చినా అధికారులు ఇతడిని పట్టించుకోలేదని విమర్శించారు. మానవతా దృక్పథంతో సర్వే నిర్వహించి పట్టా ఇప్పించాలని కోరారు.

# ఠాణాను పరిశీలించిన ఎస్పీ

అక్షరదర్బార్, టేకుమట్ల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడం ఈ తనిఖీ ముఖ్య ఉద్దేశంగా తెలిపారు. ఈ సందర్భంగా "వన మహోత్సవం" కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్టేషన్ ప్రాంగణ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ అన్నారు.



## కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా రెండోసారి దొడ్డి కిష్టయ్య

- నియామకం పట్ల మండల పార్టీ శ్రేణుల హర్షం

అక్షర దర్బార్, చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా చిట్యాలకు చెందిన దొడ్డి కిష్టయ్య రెండోసారి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి అధిష్టానం ఈ అవకాశం కల్పించింది. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతిలకు కిష్టయ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



## ముదిరాజ్ నాయకుల ముందస్తు అరెస్ట్

- ఆందోళనకు పిలుపునివ్వడంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు

అక్షర దర్బార్, చిట్యాల: తమ కమ్యూనిటీ కోసం కేటాయించిన భూమిని తిరిగి వెనక్కి తీసుకున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, చిట్యాల మండల కేంద్రంలోని ముదిరాజ్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం స్థానిక ఎస్సై పోచంపల్లి సతీష్ ఆధ్వర్యంలో చిట్యాల గ్రామానికి చెందిన గుండా రవీందర్, గోల్కొండ రాజు, జి. రాజులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు.



## సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డు సాధించిన గీతాంజలి పాఠశాల విద్యార్థి

- ఎస్.డి. ఆసిఫ్ రూపొందించిన 'స్నేక్ వైబ్రేట్ స్టిక్' నమూనాకు ప్రశంసలు

అక్షర దర్బార్, నర్సంపేట: కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నిర్వహించిన ఇన్‌స్పైర్ అవార్డ్స్ పోటీల్లో నర్సంపేట గీతాంజలి హైస్కూల్ విద్యార్థి ఎస్.డి. ఆసిఫ్ జిల్లా స్థాయిలో ప్రతిభ చాటాడు. ఆసిఫ్ రూపొందించిన 'స్నేక్ వైబ్రేట్ స్టిక్' నమూనా ఎంపిక కావడంతో ప్రభుత్వం రూ. 10,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్ విద్యార్థిని అభినందించారు. విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలే గొప్ప ఆవిష్కరణలకు నాంది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన.. క్రికెట్ టోర్నీ ప్రారంభం



అక్షర దర్బార్, చెన్నారావుపేట: దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రామాల స్థాయిలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సూచించారు. శుక్రవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన, అనంతరం నెంబర్ వన్ కాలనీలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే దివంగత బర్ల దేవదాస్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీకాంత్ ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని ప్రారంభించి యువకులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, క్వింటాల్ మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, వేముల సాంబయ్య, సిద్ధన రమేష్, గోపాల్ నాయక్, మోగిలి వెంకట్ రెడ్డి, కేతిడి వీరారెడ్డి, మంద యాకయ్య గౌడ్, తప్పేట రమేష్, సర్పంచ్ శ్వేత కృష్ణచైతన్య రెడ్డి, ఆవుల రాములు, ఈర్యా నాయక్, కౌన్సిలర్ రోజా రాణి, బండి హరీష్, రూపిక శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- భారీగా నగదు, సొత్తు స్వాధీనం
- గ్యాస్ స్టవ్ రిపేర్ పేరుతో బురిడీ.. చిక్కుకున్న కేటుగాడు
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన సీఐ మల్లేష్, ఎస్సై సురేష్



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాతో పాటు వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను మొగుళ్లపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుండి రూ. 48,820 నగదుతో పాటు ఒక బైక్, బంగారం మరియు వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలిలా ఉన్నాయి.. చిట్యాల సీఐ డి. మల్లేష్ ఆదేశాల మేరకు మొగుళ్లపల్లి ఎస్సై ముప్పు సురేష్ తన సిబ్బందితో కలిసి గురువారం పెద్దవాగు బ్రిడ్జ్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఉదయం 9:30 గంటల సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న హనుమకొండ జిల్లా భీమారం (పలివెల్పుల) ప్రాంతానికి చెందిన మిర్యాల భాస్కర్ (30) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితుడు మార్చి 29న మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామంలో గ్యాస్ స్టవ్ రిపేర్ చేస్తాననే నెపంతో ఒక ఇంట్లోకి ప్రవేశించి రూ. 15,000 నగదు దొంగిలించినట్లు అంగీకరించాడు. ఇదే తరహాలో మూడు జిల్లాల్లో పలు దొంగతనాలు చేసినట్లు వెల్లడించాడు. సొత్తు స్వాధీనం: నిందితుడి వద్ద నుండి మొత్తం రూ. 48,820 నగదు, ఒక మోటార్ సైకిల్, దొంగిలించిన బంగారం, వెండి ఆభరణాలను పోలీసులు సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

### అప్రమత్తంగా ఉండాలి : సీఐ మల్లేష్

ఈ సందర్భంగా సీఐ మల్లేష్ ప్రజలకు పలు సూచనలు చేశారు. గ్యాస్ రిపేర్, సేల్స్ వంటి రకరకాల కారణాలతో వచ్చే అపరిచిత వ్యక్తులను గుడ్డిగా నమ్మి ఇంటిలోకి రానివ్వద్దని కోరారు. వారి వివరాలను ధృవీకరించుకోవాలని, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్సై సురేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

- ఆరెపల్లిలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం ప్రారంభం
- 85 మందికి పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ

అక్షర దర్బార్, శాయంపేట: ఆరోగ్యమే మహాభాగ్యం అని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించాలని ఆరెపల్లి గ్రామ సర్పంచ్ దుర్నాల రమ బాపూరావు అన్నారు. ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శ్రీ శరణ్య హాస్పిటల్ సౌజన్యంతో గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కిడ్నీ స్పెషలిస్ట్ డాక్టర్ బి.వి. రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం 85 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పూర్ణచందర్, రాకేష్, శిబిర ఇంచార్జ్ రాజిరెడ్డి, ఫార్మసిస్టులు కమల, స్వాతి, శృతి, ప్రజ్వల్ యూనిట్ ఇన్చార్జి పోరండ్ల భానుమతి, సిబ్బంది రాంబాబు, ఉపసర్పంచ్ వల్లెపు తిరుపతిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# చైతన్య మోడల్ స్కూల్‌లో ఘనంగా 'గ్రాడ్యుయేషన్ డే'

- విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసిన కౌన్సిలర్లు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 15వ వార్డులో గల చైతన్య మోడల్ హైటెక్ స్కూల్‌లో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను పాఠశాల అధినేత సిరికొండ శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్, 12వ వార్డు కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నతనం నుండే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను బహుమతులుగా అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 28న పరకాలలో 'హిందూ సమ్మేళనం'

- శ్రీ చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో సన్నాహక సమావేశం
- వేద బ్రాహ్మణులకు నిర్వహణపై అవగాహన

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణ చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 28న నిర్వహించనున్న 'హిందూ సమ్మేళనాన్ని' అంగరంగ వైభవంగా విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన జాగరణ సమితి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో వేద బ్రాహ్మణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ నాగబండి విద్యాసాగర్, అధ్యక్షులు కొలుగూరి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హిందూ సమాజాన్ని చైతన్యపరచడమే లక్ష్యంగా ఈ సమ్మేళనం సాగుతుందన్నారు. కార్యక్రమంలో మాడుగుల పాపిరెడ్డి, దుప్పటి సాంబశివుడు, సిఏ యుగేంద్ర చారి, కొక్కిరల సాయి చరణ్ రావు, రాము, కార్తీక్, సుధాకర్ రావు, శ్రవణ్, రాజేశ్వర శర్మ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు శ్రీరామరక్ష

- మందారిపేట గ్రామస్థుల చొరవ ప్రశంసనీయం: ఎస్సై పరమేశ్వర్



అక్షర దర్బార్, శాయంపేట: నేరాల నివారణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని శాయంపేట ఎస్సై పరమేశ్వర్ అన్నారు. మందారిపేట గ్రామ ప్రజలు తమ గ్రామ భద్రత కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ. 10,000 విరాళాన్ని అందజేశారు. ఈ నిధులను ఎస్సై సమక్షంలో టెక్నీషియన్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మందారిపేట గ్రామస్థుల చొరవ ప్రశంసనీయమని, మండలంలోని మిగతా గ్రామాలు కూడా దీనిని స్ఫూర్తిగా తీసుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నైపుణ్యాలను పెంచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- చిన్న పరిశ్రమల స్థాపనతో ఉపాధి కల్పన దిశగా సాగాలి



అక్షర దర్బార్, పరకాల: పాలిటెక్నిక్ విద్యార్థులు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని భవిష్యత్తులో వచ్చే అవకాశాలను అందుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచించారు. శుక్రవారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం చూడకుండా, ఆధునిక సాంకేతికతతో చిన్న పరిశ్రమలు స్థాపించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు. కళాశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు గొడుగు రజిత నాగరాజు, బండి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తాం
- ములుగు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అక్షర దర్బార్, ములుగు: మారుమూల ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం, అంకంపల్లి గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అన్నారంలో రూ. 15 లక్షల సీఆర్ఆర్ నిధులతో సి.సి. రోడ్ల నిర్మాణానికి, అంకంపల్లిలో రూ. 83 లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం అంకంపల్లిలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ములుగు నియోజకవర్గానికి మొదటి విడతలో 5000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, త్వరలోనే రెండో విడతను ప్రారంభిస్తామని వెల్లడించారు. గూడు లేని ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట..**

మహిళా సంఘాల ద్వారా ఇప్ప పువ్వు, తేనె సేకరణ వంటి స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. స్థానిక అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన ఆమె, చిన్నారులతో ముచ్చటించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. అంకంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పైలట్ ప్రాజెక్ట్ కింద అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను విస్మరించకూడదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నాగారం గ్రామంలో టాస్క్ ఫోర్స్ దాడులు

- 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం
- నిందితుడు మహేందర్ అదుపులోకి..
- రూ. 42 వేల విలువైన బియ్యం సీజ్



అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలం నాగరం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ మధుసూదన్ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ ఎస్. రాజు బృందం శుక్రవారం జలిగాపు మహేందర్ (40) ఇంటిపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన బియ్యం విలువ సుమారు రూ. 42,000 ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పరకాల పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఆర్ఎస్ఐ ఓ. భానుప్రకాశ్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# మిర్చి క్వింటాకు రూ. 25 వేల మద్దతు ధర ప్రకటించాలి

- ఎనుమాముల మార్కెట్‌లో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్
- రైతులందరి సరుకులకు 'జెండా పాట' ధర వర్తింపజేయాలి

అక్షర దర్బార్, వరంగల్: మార్కెట్‌లో రైతులు పండించిన మిర్చికి క్వింటాకు రూ. 25 వేల కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వాన్నే నేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రతినిధి బృందం వరంగల్ ఎనుమాముల మార్కెట్‌ను సందర్శించి, పంటల క్రయవిక్రయాలను పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడిషనల్ డైరెక్టర్ శ్రీ లక్ష్మణుడు, డి.ఎం.ఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి మల్లేశంలకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మార్కెట్‌లో సరైన ధర రాక రైతులు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో 'జెండా పాట' పేరుతో కేవలం కొద్దిమంది రైతుల సరుకుకే అధిక ధర ఇచ్చి, మెజారిటీ రైతులకు భారీ వ్యత్యాసంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ వ్యాపారులు నిలువునా ముంచుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మిర్చికి మంచి డిమాండ్ ఉన్నప్పటికీ, వ్యాపారులు కుంటిసాకులతో ధరలు తగ్గించడం అన్యాయమన్నారు. కనీసం జెండా పాటనైనా కొద్దిపాటి వ్యత్యాసంతో రైతులందరికీ వర్తింపజేయాలని, రైతులను మోసం చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబా బాబురావు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్, ఏఐసిటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముక్కెర రామస్వామి, సుంచు జగదీశ్వర్, రైతు సంఘం నాయకులు మంద రవి, కర్ర రాజిరెడ్డి, ఐతం నాగేష్, మొగిలి శ్రీనివాస రావు, పరిమళ గోవర్ధన్ రాజు, సోమిడి రవి, పేర బోయిన, ఐలోని నరసయ్య, ప్రభాకర్ మరియు రైతులు పాల్గొన్నారు.

# పగలు చేపల వేట.. రాత్రి బ్యాటరీల చోరీ

- హసన్‌పర్తి పోలీసుల వలకి చిక్కిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా
- 13 సెల్ టవర్లలో బ్యాటరీల చోరీ, నిందితుల నుంచి భారీగా సొత్తు స్వాధీనం
- ఐదుగురు నిందితులు కటకటాల్లోకి..



అక్షరదర్బార్ , హనుమకొండ: శివారు ప్రాంతాల్లోని సెల్ టవర్లను లక్ష్యంగా చేసుకుని బ్యాటరీల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను హసన్‌పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు చెందిన ఐదుగురు సభ్యులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన కొంపల్లి గణేష్ (డ్రైవర్), బొంగరాల సుధాకర్, తన్నీరు శివాజీలకు సెల్ టవర్లు, జనరేటర్ మరమ్మతులపై పూర్తి అవగాహన ఉంది. సెల్ టవర్లలోని కొన్ని బ్యాటరీలను తొలగించినా టవర్ పని తీరులో వెంటనే లోపం కనిపించదని గుర్తించిన వీరు, సులభంగా డబ్బు సంపాదించేందుకు ముఠాగా ఏర్పడ్డారు. వీరికి చేపల దొంగతనం చేసే బీమన బోయిన నరసింహ, గడగోజు సురేష్ తోడయ్యారు.



### చోరీల పద్ధతి

నిందితులు పగటిపూట చెరువుల్లో చేపల చోరీకి రెక్కీ నిర్వహిస్తూనే, సమీపంలోని సెల్ టవర్లను గమనించేవారు. రాత్రి సమయంలో బ్యాటరీలను దొంగిలించి వాటిని మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతంలో విక్రయించి జల్సాలు చేసేవారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని హసన్‌పర్తితో పాటు యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో మొత్తం 13 చోట్ల వీరు దొంగతనాలకు పాల్పడ్డారు. గతేడాది మార్చి 3న హసన్‌పర్తి పరిధిలోని అనంతసాగర్‌లో 48 బ్యాటరీలను ఎత్తుకెళ్లడంతో పోలీసులు ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించారు.

### పోలీసుల ఆపరేషన్

సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుల కదలికలపై నిఘా పెట్టాయి. బుధవారం తెల్లవారుజామున హసన్‌పర్తి మండలం దేవన్నపేట శివారు ఓఆర్‌ఆర్ టోల్ గేట్ వద్ద చోరీ సొత్తును అమ్మేందుకు యత్నిస్తుండగా ఐదుగురిని పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.1.98 లక్షల విలువైన 144 బ్యాటరీలు, రూ.2.60 లక్షల నగదు, రెండు ట్రాలీలు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన డీసీపీ ధార కవిత, ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సైలు దేవేందర్, సుజిత్ రెడ్డి, సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

# ఐసుక్రీం ఆశచూపి అనంతలోకాలకు

- ఆడపిల్లలు పుడుతున్నారనే అక్కసు..
- వివాహేతర సంబంధానికి అడ్డంకి అని కక్ష
- భార్య, ఇద్దరు కుమార్తెలను స్విమ్మింగ్ పూల్‌లో ముంచి చంపిన కిరాతకుడు
- సంచలనం సృష్టించిన ట్రిపుల్ మర్డర్ కేసు గుట్టురట్టు
- ముగ్గురి హత్య కేసులో డాక్టర్లు, ఆర్ఎంపీల నిర్వాకం వెలుగులోకి
- భర్త అజారుద్దీన్ తో సహా 10 మంది అరెస్ట్



అక్షరదర్బార్ , హనుమకొండ: ఆడపిల్లలు జన్మిస్తున్నారనే నెపంతో ఒకవైపు, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారనే కక్షతో మరోవైపు.. ఒక కిరాతక భర్త తన భార్యను, ఇద్దరు కన్న బిడ్డలను అతి దారుణంగా హత్య చేసిన ఘటన హనుమకొండ జిల్లాలో సంచలనం సృష్టించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఐనవోలు మండలం పున్నెలు గ్రామానికి చెందిన ఎండీ అజారుద్దీన్ (29), అదే గ్రామానికి చెందిన ఫరహత్‌ను 2016లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి హుమేరా (9), ఆయేషా (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, కుమారుడు కావాలనే కోరికతో ఉన్న అజారుద్దీన్ కుటుంబ సభ్యులు, గతంలో రెండుసార్లు ఫరహత్ గర్భం దాల్చినప్పుడు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. ఆడపిల్ల అని తెలియడంతో డాక్టర్లు, ఆర్ఎంపీల సహకారంతో ఆమెకు ఇష్టం లేకపోయినా బలవంతంగా అబార్షన్లు చేయించారు. ఇదే క్రమంలో అజారుద్దీన్ ఒక మైనర్ బాలికను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి తెచ్చాడు. తనకు భార్య, పిల్లలు ఉన్నారనే కారణంతోనే ఆ బాలిక నిరాకరిస్తోందని భావించిన నిందితుడు, వారిని అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు.

### -పక్కా ప్లాన్‌తో దారుణం

ఈ నెల 1వ తేదీ రాత్రి, ఐసుక్రీం తినిపిస్తానని నమ్మించి భార్య పిల్లలను కారులో తాను నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ వద్దకు తీసుకెళ్లాడు. ముందుగానే అక్కడ సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరా నిలిపివేసి, ముగ్గురిని బలవంతంగా నీటిలోకి నెట్టి, వారు ప్రాణాలు విడిచే వరకు నీటిలో ముంచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం వారు ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయారని నమ్మించే ప్రయత్నం చేశాడు.

### -పోలీసుల దర్యాప్తు

మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు టెక్నాలజీ సాయంతో అసలు నిజాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అజారుద్దీన్‌తో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులు, లింగ నిర్ధారణ చేసిన ఆర్ఎంపీలు, ల్యాబ్ టెక్నీషియన్లు మొత్తం 10 మందిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ రవళి కోసం గాలిస్తున్నారు. నిందితుల్లో కొందరిపై గతంలోనే పలు కేసులు ఉన్నట్లు సీపీ వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీసీపీ అంకిత్ కుమార్, ఏసీపీ వెంకటేష్, సీఐ రాజగోపాల్, ఇతర పోలీసు సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




అక్షరదర్బార్, హనుమకొండ: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పరిపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా హనుమకొండ జిల్లాలో వైద్య ఆరోగ్య, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగ శిబిరం, యోగ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి హాజరై ప్రారంభించి, స్వయంగా యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగా మన భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, మన దేశంలో పుట్టిన యోగా విధానం నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రాముఖ్యత పొందిందన్నారు. యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి సంబంధిత వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు, ముఖ్యంగా ముప్పై సంవత్సరాలు దాటిన వారు తప్పనిసరిగా యోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉచిత హోమియో, ఆయుర్వేద వైద్య సేవలతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్. మహేంద్ర కుమార్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భాను కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డీపీఆర్ ఓ ఆయుబ్ అలీ, వైద్యులు జగదీశ్వర్ ప్రసాద్, రజిత, శోభ, డాక్టర్ కిరణ్ కుమార్, ఫార్మసిస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.